ఇసుక అక్రమ తరలింపు నిగ్గు తేల్చండి

- పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు
- దాదాపు 600 టన్నుల ఇసుక మాయమైనా స్పందిచకుంటే ఎలా
- వెంటనే కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేయండి
- ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి డిమాండ్


ఆళ్లగడ్డ పట్టణంలోని మార్కెట్ యార్డులో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు స్టాక్‌పాయింట్‌లో డంపింగ్ చేసి ఉంచిన ఇసుకను అక్రమంగా తరలించిన వ్యవహారంపై అధికారులు నిగ్గు తేల్చాలని మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి డిమాండ్ చేశారు. స్టాక్ పాయింట్ నుంచి దాదాపు 600ల టన్నుల ఇసుకను గత నెల 21వ తేదీన మాయం అయిన సంఘటనపై హౌసింగ్, పోలీసు అధికారులు స్పందించకపోవడం సమంజసం కాదన్నారు. ఈ మేరకు మంగళవారం ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన గంగుల అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తరలింపుపై హౌసింగ్ అధికారులు కేసును నమోదు చేయాలని ప్రయత్నిస్తుండగా పోలీసులు మాత్రం తర్జనభర్జన పడుతున్నారని ఆరోపించారు. ఒక్కసారిగా సుమారు 20 నుండి 30 లారీల ఇసుకను ఇక్కడి నుంచి తరలించడానికి చాలా సమయం పడుతుందని, అయినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంలో అంతర్యాన్ని ప్రజలు గమనించాలని కోరారు. జమ్మలమడు, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల నుంచి బ్రతుకు తెరువు కోసం ట్రాక్టర్లలో ఇసుక తీసుకొస్తే భారీగా జరిమానాలు విధించే అధికారులు స్టాక్ పాయింట్ నుంచి ఇసుక మాయం అయితే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. దాదాపు రూ.15.00 లక్షల పెదల సొమ్ము దొంగతనానికి గురైతే పోలీసు అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు. దిన పత్రికలలో వార్తలు ప్రచురితమైనా పట్టించుకున్న పాపాన పోలేదని అసహనం వ్యక్తం చేశారు. సీసీ పుటేజీ పరిశీలిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయని, అక్రమానికి పాల్పడింది ఏవరు? వారికి వేనుక ఉన్న రాజకీయనాయకులు ఎవరు? అన్న వాస్తవాలను బయట పెట్టాలని ఈ సందర్భంగా గంగుల డిమాండ్ చేశారు.

సీఎం చంద్రబాబు... ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలి

సీఎం చంద్రబాబునాయుడు ప్రజలను మభ్యపెట్టడం మానుకోవాలని, ఎన్నికల ముందు గుప్పించిన ప్రతి హామీని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఎంతో అనుభవజ్ఞుడిని, ఎంతో మెరుగా పాలన చేస్తానంటూ ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించి ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన బాబు ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యాఖ్యానించడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. అధికారం చేపట్టిన తరువాత నేను రాష్ట్ర ప్రజలకు ఏదేదో చేయాలనుకున్నాను... కానీ ఖజానా ఖాళీ అయ్యింది... హామీల అమలు భయం అవుతుందంటూ సాక్షాత్తూ సీఎం బాబు వ్యాఖ్యానించడం ఎవరిని మభ్యపెట్టేందుకు అని ప్రశ్నించారు. టీడీపీ కూటమి ప్రభుత్వ వందరోజులు పాలనలో ఏ ఒక్క హామీనైనా స్పష్టంగా అమలు చేశారా అని నిలదీశారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, తెలంగాణా ప్రభుత్వం తీరునే టీడీపీ కూటమి సర్కార్ ప్రజా వ్యతిరేకత చవిచూస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాసారి వెంకటేశ్వర్లు, సింగం వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ సురేంద్ర, సుధాకర్‌రెడ్డి, శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గాంధీ జయంతి

నంద్యాల(రూరల్): పట్టణంలోని గాంధీ చౌక్‌లో మహాత్మ గాంధీ విగ్రహం వద్ద బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వేడుకలకు రాష్ట్ర న్యాయ, ముస్లిం మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, అధికారులు పాల్గొంటారన్నారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి

ఆళ్లగడ్డ: పట్టణంలోని స్వయం సహాయ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సూచించారు. సాధారణ బదిల్లో భాగంగా ఆళ్లగడ్డలో విధులు నిర్వహిస్తున్న శోభ కర్నూలు పీడీ కార్యాలయానికి, సుబ్బయ్య ఆత్మకూరు మెప్మా కార్యాలయానికి బదిలీ కాగా వారి స్థానంలో డీఎంసీ రాములు, హిమబిందు ఆళ్లగడ్డ మెప్మాకు నియమించడం జరిగింది. ఈ మేరకు వారు సోమవారం కమిషనర్ వెంకట్రామిరెడ్డిని కలిసి బాధ్యతలు స్వీకరించారు.

పింఛన్ల పంపిణీ

దొర్నిపాడు: మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో మంగళవారం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. 3,690 మంది లబ్ధిదారులు ఉండగా 3,529 మందికి నగదు అందజేసినట్లు చెప్పారు.

క్లుప్తంగా

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

ఆళ్లగడ్డ : పట్టణంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వయోవృద్ధులకు డాక్టర్లు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి సూచనలు ఇచ్చారు. అనంతరం వైద్య, ఆరోగ్య అధికారులు, సిబ్బంది స్థానిక వైద్యశాల నుంచి పాత బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు


మోడల్ విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు మానస, వెంకటశ్రీవల్లి, కేతలిన్, జగదీశ్వరీ ఎస్‌జీఎఫ్ అండర్–19 ఆర్చరీ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. సెప్టెంబర్ 30న కర్నూలులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించారని ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులతో పాటు పీడీ శ్రీనివాసులును ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ


నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

దొర్నిపాడు: విజయవాడ వరదబాధితులకు ఆళ్లగడ్డ షైన్ ఇండియా పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్, పాస్టర్ అందనం మనోహర్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అందనం మనోహర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి శేఖర్, వైస్ ప్రెసిడెంట్ జేఎం సామేల్, కోశాధికారి జాన్ తిమోతి, ముఖ్య సలహదారు జోసఫ్, అమరావతి ఏరియా పాస్టర్ ప్రవీణ్ తదిరులు పాల్గొన్నారు.

సన్మానం


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : మండల పరిధిలోని బోడెమ్మనూరు గ్రామంలో మంగళవారం అధికారులు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు పెద్ద ఓబన్న, అస్తన్నను ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ సువర్ణ, సచివాలయ ఉద్యోగులు శాలువ కప్పి పూల మాలతో సన్మానించారు.

నంద్యాలలో..


జాషువాను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): యెహోవా ఈరే పవర్ టెంపుల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రెవరెండ్ డాక్టర్ నేగల జాషువా సేవలకు గుర్తుగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్ రావటం అభినందనీయమని, ఆయన జీవితంలో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుమల్ల రహీం తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఉభయ తెలుగు రాష్ట్రాల క్రిస్టియన్ జేపీసీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి రెవరెండ్ మన్నెం జానయ్య అధ్యక్షతన జాషువాను సన్మానించారు.

మద్యం దుకాణాలు బంద్

బొమ్మలసత్రం: ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారం బంద్ చేశారు. కూటమి ప్రభుత్వం తెస్తున్న కొత్త మద్యం పాలసీతో తమ ఉద్యోగాలు పోతాయని మద్యం షాపు సిబ్బంది షాపులు మూసేసి నిరసన తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ యువకుల కోసం పభుత్వ మద్యం దుకాణాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పించారు. వీరికి గత నెల 30వ తేదీతో గడువు ముగిసింది. కొనసాగిస్తూ ప్రకటన చేయకపోవడంతో వారు మంగళవారం మద్యం దుకాణాలు మూసి నిరసన తెలిపారు. కాగా ఉద్యోగాల కొనసాగింపునకు కృషి చేస్తానని సాయంత్రం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ హామీ ఇవ్వడంతో వారు తిరిగి దుకాణాలు తెరిచారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


పత్తి రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సుధాకర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ రంగనేతాజీ

ఉయ్యాలవాడ : ప్రతి రైతు భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వాడాలని కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని హరివరం గ్రామంలో సాగైన పత్తి, మిరప, కంది పంటలను ఏడీఏ పరిశీలించారు. పత్తి పంటను సోకిన గులాబీ రంగు పురుగును సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించి నివారించుకోవాలని ఏడీఏ రైతులకు సూచించారు. 40 రోజుల పంటకు తప్పనిసరిగా లింగాక్ష బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కంది, మొక్కజొన్న, మినుము తదితర పంటలను ఆశించే పురుగుల, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ ప్రభావతమ్మ, ఆత్మ ప్రాజెక్ట్ ఏఓ ఉమామహేశ్వరమ్మ, ఏఈఓ రాజెమ్మ, గ్రామ వ్యవసాయ సహాయకులు సిద్దిక్ బాషా, సాయి, జగన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్దతులతో అధిక దిగుబడులు

చాగలమర్రి: ఆధునికి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే దిగుబడులు వస్తాయని ఏఓ రంగనేతాజీ తెలిపారు. మండలంలోని డి.వనిపెంట, చింతలచెరువు గ్రామాలలో మంగళవారం ఏఓ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలను రైతులతో కలిసి పరిశీలించిన ఏఓ తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యులు దీపాకుమారి, ఏఈఓ మంజుల, వీహెచ్ఏ, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

పొటాష్ ఎరువులతో రోగనిరోధక శక్తి మెండు


మాట్లాడుతున్న ఏడీఏ రాజశేఖర్

నంద్యాల(అర్బన్): ఎకరా వరి పైరుకు 20 కేజీల పొటాష్ ఎరువులు చల్లితే పంటకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని ఏడీఏ రాజశేఖర్ రైతులకు సూచించారు. తద్వార తెగుళ్ల, పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొత్తపల్లె, బిల్లలాపురం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా మట్టిపరీక్షలు చేయించుకొని ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏఓ ప్రసాదరావు, ఏఈఓ రవికుమార్, వీపీఏలు చక్రిధర్ రెడ్డి, శివనాయక్, వీహెచ్ఏ అనూష గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ


పూజలందుకున్న అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళికాంబ మూల విరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలచే అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వస్త్రాలతో అలంకరించి పూలంగి సేవా నిర్వహించారు. ఒడిబియ్యం, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రేనాటి సూర్యచంద్రుల సేవా సమితికి పురస్కారం


కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సమితి అధ్యక్షుడు బాబు

ఉయ్యాలవాడ : జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన రేనాటి సూర్యచంద్రుల సేవా సమితికి పురస్కారం దక్కింది. జిల్లా కేంద్రం నంద్యాలలోని రామక్రిష్ణ పీజీ కళాశాలలో జాతీయ రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో స్వచ్ఛందంగా రక్త దాన శిబిరాలు నిర్వహించే సొసైటీలకు అవార్డులు అందజేశారు. ఈ మేరకు సమితి అధ్యక్షుడు దూదేకుల బాబు జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు రాజకుమారి గణియా చేతుల మీదుగా మంగళవారం అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో రామక్రిష్ణ పీజీ కళాశాల అధినేత రామక్రిష్ణారెడ్డి, రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, స్టేట్ కమాండెంట్ అరవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

యాగంటి క్షేత్రానికి రూ.3.84 లక్షల ఆదాయం

నంద్యాల(రూరల్): టూరిస్ట్ డార్మెటరీ వేలం ద్వారా యాగంటి క్షేత్రానికి రూ.3.84 లక్షల ఆదాయం సమకూరింది. మంగళవారం కలెక్టరేట్‌లోని ఏపీ టూరిజం కార్యాలయంలో యాగంటి క్షేత్రం వద్ద ఉన్న టూరిస్ట్ డార్మెటరీకి బహిరంగ వేలం పాట నిర్వహించారు. ముగ్గురు పోటీదారులు పాల్గొనగా బనగానపల్లెకు చెందిన మలికిరెడ్డి దస్తగిరి రెడ్డి అత్యధికంగా రూ.3,84,680కు పాట పాడి దక్కించుకున్నారు. రెస్టారెంట్, పరిసరాలను అభివృద్ధి చేసి పర్యాటకులకు వసతులు ఏర్పాటు చేసి డార్మెటరీని నిర్వహించుకోవాలని పర్యాటక శాఖాధికారి సత్యనారాయణ తెలిపారు.

రెండు ప్రభుత్వ గృహాల కూల్చివేత

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో ప్రభుత్వ జలవనరుల శాఖకు చెందిన రెండు 'ఏ'టైపు గృహాలను అనధికార వ్యక్తులు మంగళవారం కూల్చివేశారు. అధికార పార్టీకి చెందిన మండలస్థాయి నాయకుడు ఒకరు అందులో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. ఎటువంటి అధికార అనుమతులు లేకుండా గృహాలను కూల్చివేశారు. ఈ విషయమై అతడిని వివరణ కోరగా పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని, పునర్నిర్మాణం కోసం కూల్చి వేశామని చెప్పుకొచ్చారు. కాగా డ్యాం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ప్రభుత్వం మధ్యంతర భృతిని ప్రకటించాలి


చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

చాగలమర్రి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో మంగళవారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సరెండర్ లీవ్స్, ఏపీజీఎల్ఐ, డీఏ అరియర్స్‌లను వేంటనే మంజూరు చేయాలన్నారు. 11వ పీఆర్‌సీ అమలులో జరిగిన నష్టాన్ని 12వ పీఆర్‌సీలో న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు నారాయణమూర్తి, నరసింహారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, పీడీ దాదాపీర్, సుబ్రహ్మణ్యం, సహదేవారెడ్డి, మహబూబ్‌బాషా, మద్దిలేటి రాజు, హరిహరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నాం

- రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల(అర్బన్): పింఛన్ల పంపిణీని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని చేపట్టిన పింఛన్ల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. చంద్రన్న ప్రభుత్వం ఎలా ఉందంటూ ఆయన పింఛన్దారులను ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం ఒకపక్క అభివృద్ధితోపాటు మరోపక్క సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. వందరోజుల పాలనలో పింఛన్లు పెంపు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, దీపావళికి మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

97.66 శాతం పింఛన్ పంపిణీ పూర్తి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో మొదటి రోజు 97.66 శాతం పింఛన్ పంపిణీ పూర్తి అయిందని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. ఎస్‌బీఐ కాలనీలో ఆమె అర్హులైన వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లను పంపిణీ చేశారు. జిల్లాలో 2,18,225 పింఛన్ దారులకు గాను 2,13,114మందికి మొదటి రోజే ఇంటి వద్దకు వెళ్లి గ్రామ సచివాలయ సిబ్బంది పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

• గాంధీజీకి చిత్రనివాళి



జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని పట్టణానికి చెందిన 9వ తరగతి విద్యార్థి సాహిత్ వేసిన గాంధీజీ ప్రొట్రాయిట్ చిత్రం పలువురిని ఆకట్టుకుంది. స్థానిక కోటేష్ ఆర్ట్ అకాడమీలో మంగళవారం 13.50 అంగుళాల పొడవు, 10 అంగుళాల వెడల్పు డ్రాయింగ్ సీట్‌పై 3,725 చిన్నరంగురాళ్లను క్రమంగా అతికిస్తూ 3 గంటలు శ్రమిస్తూ గాంధీజీ చిత్రాన్ని గీసి ప్రశంసలు అందుకున్నారు.

– నంద్యాల(అర్బన్)

ఓటరు సవరణ దరఖాస్తులు పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీలు

నంద్యాల(అర్బన్): ఓటర్ల సవరణకు దరఖాస్తులు స్వీకరించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తన కార్యాలయం నుంచి ఓటర్ల సవరణ ప్రక్రియ 2025పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల ఇంటింటి సర్వే ప్రక్రియ 99.07 శాతం పూర్తయిందన్నారు. వివిధ ఫారాలకు సంబంధించి 4,488 క్లైయిమ్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ సంబంధించి అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించామని, ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 10, నంద్యాల నియోజకవర్గంలో 5 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

హక్కులకు భంగం కలగకుండా ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): గ్రీన్ కో ఎలక్ట్రికల్ పవర్ ట్రాన్స్మిషన్ ఏర్పాటుకు సంబంధించి షెడ్యూల్ కులాల హక్కులకు భంగం కలగకుండా సబ్ డివిజనల్ కమిటీ సూచించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రీన్‌కో ఎలక్ట్రికల్ పవర్ లైన్ ట్రాన్స్మిషన్ ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, నంద్యాల, డోన్ ఆర్డీఓలు మల్లికార్జున రెడ్డి, మహేశ్వర్ రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీన్ కో ఎలక్ట్రికల్ పవర్ లైన్ ట్రాన్స్మిషన్ ఏర్పాటు నిమిత్తం డోన్ డివిజన్ పరిధిలో 13.23 హెక్టార్లు, నంద్యాల డివిజన్‌లో 4 హెక్టార్లకు సంబంధించిన భూములు షెడ్యూల్ కులాల వారికి భంగం కలగకుండా గ్రామ సభలలో తీర్మానించిన ప్రతిపాదనలను జిల్లా జిల్లాస్థాయి కమిటీ పరిశీలించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ సూర్యచంద్రరాజు పాల్గొన్నారు.

పొదుపు గ్రూపు లీడర్ చేతివాటం


గ్రూపు పత్రాలు చూపుతున్న పొదుపు మహిళలు

- సభ్యులకు తెలియకుండా తన ఖాతాలో రూ.లక్ష జమ చేసుకున్న వైనం
- మృతిచెందిన సభ్యురాళ్ల వేలి ముద్రలతో మోసం
- అక్రమాలకు సహకరించిన మరో గ్రూపు బుక్ కీపర్
- న్యాయం చేయాలంటున్న గ్రూపు సభ్యురాళ్లు

నంద్యాల(అర్బన్): పొదుపు గ్రూపు లీడర్ గండు నాగేశ్వరమ్మ గ్రూపు సభ్యురాళ్లకు తెలపకుండా బ్యాంకు అకౌంట్‌లో ఉన్న రూ.లక్షను తన వ్యక్తిగత అకౌంట్‌లోకి జమ చేసుకున్న ఘటన గోస్పాడు మండలం కానాలపల్లె గ్రామం అన్నపూర్ణ పొదుపు లక్ష్మి గ్రూపులో చోటుచేసుకుంది. మృతిచెందిన సభ్యురాలి వేలిముద్రలతో బ్యాంకు సిబ్బందికి అనుమానం రాకుండా డబ్బు జమ చేసుకోవడంపై సభ్యురాళ్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీబగుంట్ల ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిధిలో 20 ఏళ్ల క్రితం 13 మంది సభ్యులతో గ్రామంలో అన్నపూర్ణ పొదుపు లక్ష్మి గ్రూపు ఏర్పాటైంది. మొదటి లీడర్‌గా నాగేశ్వరమ్మ, రెండో లీడర్‌గా కవితలతో ఏర్పాటైన పొదుపు గ్రూపు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలకు కంతులు చెల్లిస్తూ పదేళ్ల పాటు బాగా నడిచింది. 8ఏళ్ల క్రితం నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులు టీడీపీకి మద్దతు పలకడంతో సభ్యురాళ్ల గ్రూపులుగా విడిపోవాల్సి వచ్చింది. పొదుపు కట్టించుకోకపోవడం, మీటింగ్‌లకు హాజరు కాకపోవడంతో మొదటి లీడర్ నుంచి నాగేశ్వరమ్మ తప్పుకోవాలని సభ్యురాలు కోరినా అందుకు ససేమిరా అంది. దీంతో కొన్నేళ్ల పాటు సంఘం సభ్యురాళ్లు స్తబ్దుగా ఉండాల్సి వచ్చింది. లావాదేవీలు నిలిచిపోయే సమయానికి గ్రూపులో దాదాపు రూ.70 వేల వరకు పొదుపు డబ్బు ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న ఆసరా వడ్డీలతో కలిపి 2024లో దాదాపు రూ.1.30 లక్షలు ఉంది. గ్రూపు లీడర్ నాగేశ్వరమ్మ గత ఆగస్టు నెలలో రూ.లక్ష ఇవ్వాలంటూ అందుకు గ్రూపు సభ్యురాలు సంతకాలు ఉన్నాయని బ్యాంకు అధికారులను నమ్మించి సొమ్ము చేసుకుంది.

ఇందుకు మరో పొదుపు గ్రూపు బుక్ కీపర్ నరసింహుడు సహకారం అందించారు. ఇటీవల గ్రూపు సభ్యురాలు కొందరు బ్యాంకుకు వెళ్లగా సిబ్బంది మీ గ్రూప్‌కు రూ.లక్ష ఇచ్చామంటూ తెలపడంతో సభ్యురాళ్లు లింగమ్మ, సుబ్బమ్మ, వెంకటలక్ష్మమ్మ, వెంకటమ్మ, వెంకటసుబ్బమ్మ, పార్వతమ్మ, బావమ్మ ఆందోళన చెందారు. తమకు తెలియకుండా పొదుపు డబ్బు వ్యక్తిగత ఖాతాలో జమ చేసుకున్న నాగేశ్వరమ్మపై పోలీసులు కేసు నమోదు చేయాలని సభ్యురాళ్లు కోరుతున్నారు. న్యాయం చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

దుస్తుల దుకాణంలో చోరీ

ఆళ్లగడ్డ: పట్టణంలోని దుస్తుల దుకాణంలో చోరీ జరిగింది. కందుకూరు రహదారిలోని మదీనా శారీ సెంటర్ యజమాని అబ్దుల్లా రోజు మాదిరి వ్యాపారం ముగించుకుని సోమవారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన అబ్దుల్లా సెట్టర్ తాళాలు తెరిచి ఉండటం చూశాడు. లోపలికి వెళ్లి చూడగా రూ.65 వేల నగదుతోపాటు కమ్మలు, ఉంగరాలు చోరీకి గురయ్యాయని బాధితుడు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ చిరంజీవి తెలిపారు.